# విరిగిన విద్యుత్ స్తంభం తొలగింపు

మద్దూరు (ధూళిమిట్ట), నవంబర్15: మద్దూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కొన్నేండ్ల క్రితం విద్యుత్ స్తంభం విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' అనే శీర్షికన ఈనెల 12న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన చేర్యాల ట్రాన్స్‌కో ఏడీ వెంకట్ గౌడ్ స్పందించారు. ఆయన ఆదేశాలతో విరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం విద్యుత్ సిబ్బంది తొలగించారు. దీనికి కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ధన్యవాదాలు తెలిపారు.



పమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించిన అధికారులు

# హామీలు అమలు చేతగాక అక్రమ కేసులు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూర్, నవంబర్15: సీఎం సొంత నియోజకవర్గంలో ప్రజలు, రైతులపై అక్రమ కేసులు పెట్టించి జైలులో పెట్టించిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందని.. రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ నాయకులను అణచివేయాలని చూస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపిపి కీసరి పాపయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ హెచ్చరించారు. చిన్నకోడూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హామీలు అమలు చేతగాక అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రైతుల అనుమతి లేకుండా ఫార్మా కంపెనీ ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. కలెక్టర్ అభిప్రాయ సేకరణలో అన్ని పార్టీలకు చెందిన రైతు నాయకులు ఉన్నారని, కానీ బీఆర్ఎస్ నాయకులపైన అక్రమ కేసులు పెట్టారన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు రైతుల కోసం ప్రాజెక్టులు నిర్మించాలని చూసినప్పుడు అడ్డుపడ్డ రేవంత్‌రెడ్డి సొంత అల్లుడి స్వలాభం కోసం ఫార్మా కంపెనీ తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

## యువకుడి ఆత్మహత్య

గజ్వేల్, నవంబర్ 15: వ్యవసాయపొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ధర్మారెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాచకొండ అశోక్(35) శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద ఆరబెట్టిన ధాన్యం రాశిని చూసొస్తానని భార్యకు చెప్పిన వెళ్లిన భర్త చాలా సేపటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. స్థానికుల సాయంలో పొలం వద్దకు వెళ్లి అర్ధరాత్రి చూడగా చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

# కులగణన సమగ్రంగా చేపట్టాలి


భూంపల్లిలో సర్వే వివరాలను తెలుసుకుంటున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), నవంబర్ 15: సామాజికంగా అన్ని కులాలకు న్యాయం జరగాలంటే కులగణన సమగ్రంగా జరగాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో నిర్వహిస్తున్న కులగణన వివరాలను ఆయన ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జనాభా ఆధారంగా రిజర్వేషన్లు రావాలంటే కులగణన జరగాలన్నారు. ప్రతి ఒక్కరూ సర్వే చేసే అధికారులకు సహకరించాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆయితం శ్రీనివాస్ ఉన్నారు.

# దళితులను విడదీసేందుకు బీజేపీ కుట్ర


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాలమహానాడు సంఘం నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 15: దళితులను విడదీసేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మద్దూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో పాదయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో అక్టోబర్ 25న భద్రాచలంలో పాదయాత్ర ప్రారంభించారని, హైదరాబాద్‌లో డిసెంబర్ 1న పాదయాత్ర ముగియనున్నట్లు తెలిపారు. మద్దూరు మండల అధ్యక్షుడు బొప్పె నాగయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి మేడిపల్లి నరసింహ, డివిజన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కనకయ్య, బాలనర్సయ్య, నీల బాలకృష్ణ, రాజయ్య, వెంకటయ్య, చెంచల అశోక్, సిలివేరి రాజు, నీరటి క్రాంతి పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం: సీపీఎం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్15: ప్రజా సమస్యలపై సీపీఎం రాజీలేని పోరాటం చేస్తున్నదని ఆ పార్టీ మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి అన్నారు. శుక్రవారం ఈనెల 19న మద్దూరు తాజ్‌మహల్ గార్డెన్‌లో జరగనున్న సీపీఎం మం డల మహాసభ కరపత్రాన్ని సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. నాయకులు అల్ల రమేశ్, ఇరుమల్ల రమేశ్, పిట్టల నరేశ్, అల్ల శ్రీకాంత్, ఇట్టమైన శంకర్, బోయిని జగన్, మల్లేశం, సురేశ్, కిష్టయ్య, శివశంకర్ పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చాలి


మాట్లాడుతున్న గొడుగు జ్యోతిస్వామి

గజ్వేల్, నవంబర్ 15: అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కొల్గూర్ మాజీ ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రైతుబంధు రూ. 15వేలు, పింఛన్ రూ. 4వేలు, ఇందిరమ్మ ఇండ్లు, నిరుద్యోగ భృతి, మహిళలకు గృహజ్యోతి, ధాన్యం క్వింటాళ్లకు ఐదు వందల బోనస్ ఇస్తామని చెప్పి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, తులం బంగారం, రుణమాఫీ పథకాలకు మంగళం పాడారన్నారు. ఆంజనేయులు, అనిల్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

# బౌద్ధం ద్వారానే సమసమాజం సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న శీలం ప్రభాకర్

సిద్దిపేట, నవంబర్ 15: సమసమాజం ఏర్పడాలంటే గౌతమ బుద్ధుడు సూచించిన బౌద్ధం ద్వారానే సాధ్యమవుతుందని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి శీలం ప్రభాకర్ అన్నారు.శుక్రవారం సిద్దిపేటలో కార్తిక పౌర్ణమి సందర్భంగా భారత బౌద్ధ మహా సభ సమావేశం నిర్వహించారు.అనంతరం బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎనగందుల శంకర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌గౌడ్, ఉప్పర పద్మ, రేణుక, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల నర్సింహులు, కార్యదర్శులు వాగ్మారే సునీత, వేముల ప్రసన్న,కోశాధికారి మన్నె సాయి బాబా, కార్యవర్గ సభ్యులుగా మచ్చ గణేశ్, సావుల రాజమౌళి, ఏలా కిషన్, పుట్ట రాజు, జంజిరపు ఎల్లేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శులు ఉప్పర మల్లేశం, కర్రె లక్ష్మీ తులసి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేందర్, గడ్డం మోహన్‌రెడ్డి, దొడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

# ఆలయాల్లో కార్తిక శోభ

కార్తిక పౌర్ణమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొన్నది. శివాలయాలతో పాటు ఇతర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. స్వామివారికి దీపాలు వెలిగించి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. రాత్రి ఇండ్ల ముందు దీపాలు వెలిగించి స్వామివారికి మొక్కుకున్నారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ,నవంబర్ 15


మద్దూరు(ధూళిమిట్ట): బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


చేర్యాల: వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు


కొండపాక(కుకునూరుపల్లి): మర్పడగ క్షేత్రంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు


హుస్నాబాద్‌లోని కాశీమరకతలింగేశ్వరాలయంలో దర్శనం కోసం క్యూలో భక్తులు


హుస్నాబాద్: ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు, అలంకరణ చేస్తున్న భక్తులు


సిద్దిపేటలోని కోటిలింగేశ్వరస్వామి దేవస్థానంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


సిద్దిపేటలో వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి పల్లకీసేవలో హారతి ఇస్తున్న పూజారి




సిద్దిపేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- భక్తపారవశ్యంలో భక్తులు
- పెద్ద ఎత్తున హాజరైన జనం

# భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 15: ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్చకుడు తిగుళ్ల రామమూర్తి వైదిక నిర్వహణలో కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణస్వామి వ్రత మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, నవగ్రహ పూజ, గౌరీపూజలతో పాటు సత్యనారాయణస్వామి వ్రతకల్పాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**చేర్యాలలో...**

చేర్యాల, నవంబర్ 15: అయ్యప్ప స్వామి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి.41 మంది దంపతులు పాల్గొన్న సత్యనారాయణ స్వామి వ్రతం, అష్టలక్ష్మి పూజల్లో సామూహిక కుంకుమార్చన, కలశస్థాపన, గణపతి పూజ, రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతం, నవ విదాభిషేకం, నవగ్రహపూజలు, అష్టదిక్పాలక పూజలు, పంచలోకపాలన పూజలు నిర్వహించారు. వేద పండితులు దేశపతి చైతన్య, రాజుశర్మ సత్యనారాయణ స్వామివ్రత కథ ప్రవచనం భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు టి.ఆంజనేయులు పాల్గొన్నారు.

**నాచగిరిక్షేత్రంలో వ్రతాలు**

వర్గల్, నవంబర్ 15: సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలతో నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కుటుంబ సమేతంగా పెద్దఎత్తున వ్రతాలు ఆచరించారు. ఉపదేవాలయమైన శివాలయం ఎదుట సాయంత్రం మహిళలు కార్తిక దీపారాధన చేశారు. సామూహిక వ్రతాలతో సత్యనారాయణ మండపం భక్తులతో రద్దీగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కార్యనిర్వాహకురాలు అన్నపూర్ణ, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్ ఏర్పాట్లు చేశారు.


ధూళిమిట్ట మండలం లింగాపూర్‌లో సామూహిక సత్యనారాయణ వ్రత మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


వర్గల్: నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు


సిద్దిపేట రూరల్: పుల్లూరు బండపై సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు


చేర్యాలలో సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు


సిద్దిపేట టౌన్: సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న భక్తులు


వర్గల్: నాచగిరిలో కార్తిక దీపారాధన చేస్తున్న భక్తులు

# బిర్సాను స్ఫూర్తిగా తీసుకోవాలి


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్


నివాళులర్పిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 15: దేశస్వాతంత్ర్యం కోసం బ్రిటిష్‌పై యుద్ధభేరి మోగించి అటవీ జాతులను కాపాడిన నాయకుడు బిర్సాను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని గిరిజన బాలుర హాస్టల్‌లో శుక్రవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బిర్సాముండా 150వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ జిల్లా మానిటరింగ్ అధికారి భాస్కర్, హాస్టల్ ప్రిన్సిపాల్ శ్రీధర్, యువజన ప్రతినిధులు లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**బిర్సాముండాకు ఘన నివాళి**

అక్కన్నపేట, నవంబర్ 15: మండలంలోని కపూర్‌నాయక్‌తండా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గిరిజన విప్లవ వీరుడు, స్వాతంత్ర్యసమరయోధుడు బిర్సాముండా జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో భానోతు జయరామ్ బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఎంపీవో మోహన్‌నాయక్, ఐసీడీఎస్ సీడీపీవో జయమ్మ, ఏపీవో ప్రభాకర్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# సిద్దిపేట గ్రంథాలయాన్ని తీర్చిదిద్దుతా


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, నవంబర్ 15: సిద్దిపేట గ్రంథాలయాన్ని రాష్ట్రంలోనే అత్యుత్తమ గ్రంథాలయంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాలను నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలన్నారు. సర్వేలో ఎలాంటి బ్యాంకు వివరాలు అడగడం లేదని, సమగ్ర కుటుంబ సర్వే ఇప్పటికే 30శాతం పూర్తయిందన్నారు. 87వేల మంది ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్నారన్నారు. కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో సదానందం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతిచక్రం అవార్డుల ప్రదానం


గజ్వేల్ : అవార్డులను ప్రదానం చేసిన ఆర్ఎం ప్రభులత

గజ్వేల్, నవంబర్ 15: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం ప్రగతి చక్రం అవార్డులను డ్రైవర్లు, కండక్టర్లకు మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రాండ్ ఫెస్టివల్‌ను చాలెంజ్‌గా తీసుకున్న డ్రైవర్లు, కండక్టర్లను అభినందించారు. డిపోకు అదనపు ఆదాయం సాధించేలా సమష్టిగా చేస్తున్న కృషిని కొనియాడారు. డిపోకు రోజుకు లక్ష ఆదాయం సమకూర్చడంలో జీపీపీ డిపో రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. ఈసందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేసి అనంతరం శబరిమాల ప్రత్యేక బుకింగ్‌కు సంబంధించిన బ్రోచర్‌ను అవిష్కరించారు. ట్రాఫిక్ సీఐ మురళి, డీఎం పవన్, అసిస్టెంట్ మేనేజర్ బాబు నాయక్, జమీల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యోగులు భాగస్వాములు కావాలి**

హుస్నాబాద్, నవంబర్ 15: ఆదాయం పెంచడంలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని హుస్నాబాద్ డీఎం వెంకటేశ్వర్లు అన్నారు. డిపో ఆవరణలో జరిగిన ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతిభ కనబర్చి బెస్ట్ ఈపీకే, బెస్ట్ కేఎంపీల్ సాధించిన డ్రైవర్, కండక్టర్లకు ప్రగతి చక్ర అవార్డుతో పాటు నగదు అందజేశారు. డిపో సూపరింటెండెంట్ శ్రీధర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ మురళి, మెకానికల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, అకౌంటెంట్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# ధర్మారంలో విరాళాల పేరిట మోసం


మాట్లాడుతున్న తీపిరెడ్డి దుర్గారెడ్డి కుటుంబ సభ్యులు

మిరుదొడ్డి, నవంబర్ 15: అన్నదాన సత్రం పేరిట రైతు డబ్బులు పోగొట్టుకున్న సంఘటన మండలంలోని ధర్మారంలో చోటు చేసుకుంది. బాధితుడు తీపిరెడ్డి దుర్గారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో శుక్రవారం ఉదయం అన్నం తింటుండగా యాత్రిక అన్నదాన సత్రం పేరిట విరాళాలు సేకరిస్తున్నామని చెప్పి ఇంటిలోకి ఆరుగురు వచ్చి కూర్చున్నారన్నారు. గ్రామంలో ప్రముఖులందరూ రూ.20 వేల వరకు విరాళం ఇచ్చారు నీవు కూడా రూ.20 వేల విరాళం ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. నా వద్ద అంత డబ్బు లేదు, వరి కొయ్యడానికి తెచ్చిన డబ్బులు రూ.5 వేలు మాత్రమే ఉన్నాయి తీసుకోవాలని బతిమిలాడడంలో తీసుకొని వెళ్లారు. బయటకు వచ్చి గ్రామంలో ఏ ఇంటిలో అడిగినా సత్రం పేరిట డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

## దళిత జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవీందర్


రవీందర్‌కు నియామకపత్రం అందజేస్తున్న చంద్రమౌళి

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 15: తెలంగాణ దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హుస్నాబాద్‌కు చెందిన బోనగిరి రవీందర్‌కు శుక్రవారం నియామక పత్రం అందజేశారు. హుస్నాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రమౌళి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రవీందర్ కృషిచేయాలని సూచించారు. దళిత సంఘాల జేఏసీ ఉపాధ్యక్షుడిగా తనను నియమించడంపై రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## మాలల మహా పాదయాత్ర కరపత్రం ఆవిష్కరణ

చేర్యాల, నవంబర్ 15: జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో కొనసాగుతున్న మాలల మహా పాదయాత్రకు సంబంధించిన కరపత్రాన్ని మండలంలోని వేచరేణిలో శుక్రవారం మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులను విడదీసేందుకు రాజకీయ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, అందులో భాగమే ఎస్సీ వర్గీకరణ అన్నారు. రాజకీయ పార్టీల కుట్రలు తిప్పకొట్టి దళితులంతా ఐక్యంగా రాజ్యాధికారం వైపునకు అడుగులు వేయాలనే ప్రయత్నమే మాల మహానాడు పాదయాత్రకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఏనుగుల కుమార్, మాజీ సర్పంచ్ ఏనుగుల దుర్గయ్య, నాయకులు ఏనుగుల మల్లయ్య, నారాయణ, మహేందర్, యాదగిరి, ప్రభాకర్, కల్లాటి రమేశ్, భిల్లం భూమయ్య, ఏనుగుల రామచంద్రం పాల్గొన్నారు.

## నేడు మంత్రి పొన్నం పర్యటన

హుస్నాబాద్, నవంబర్ 15: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం హుస్నాబాద్‌లో పర్యటించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేస్తారని చెప్పారు.

## సర్వేపై అపోహలు వద్దు

నారాయణరావుపేట, నవంబర్ 15: సర్వేపై అపోహలు అవసరం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జక్కాపూర్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కోటి 16 లక్షల ఇండ్లకు 85 వేల మంది ఎన్యూమరేటర్లతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతుందన్నారు. 35శాతం సర్వే పూర్తయిందన్నారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్, నవంబర్ 15: గజ్వేల్ నుంచి సింగాటం గ్రామానికి వెళ్లే 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజ్ఞాపూర్ విద్యుత్ ఏఈ సత్యం తెలిపారు. సింగాటం సబ్‌స్టేషన్ పరిధిలోని సింగాటం, అనంతరావుపల్లి, దాచారం గ్రామాల రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ఎరుకల కులస్తులను ఆదుకోవాలి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 15: ఎరుకుల కులస్తులకు ఆదుకోవాలని టీవైఎస్ జిల్లా అధ్యక్షుడు మురళి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ట్రైబల్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్య జయంతిని అధికారికంగా జరిపించి సిద్దిపేటలో ఏకలవ్య భవనానికి స్థలం కేటాయించాలని కోరారు. జిల్లాలోని 26 మండలాల్లో ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలన్నారు. అనంతరం ఎరుకుల కులస్తులు ట్రైబల్ నోడల్ ఆఫీసర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఎరుకుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య

గజ్వేల్, నవంబర్ 15: అద్దె ఇంట్లో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం వర్గల్ మండలం మైలారం గ్రామానికి చెందిన కాశబోయిన భాను అదే మండలం మాదారం గ్రామానికి చెందిన మైసని రేణుక(22) నాలుగు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకొని గజ్వేల్‌లో నివా సం ఉంటున్నారు. రేణుక ల్యాబ్‌టెక్నిషియన్‌గా పనిచేస్తున్నది. ఇద్దరి కులాలు వేరు కావడంతో కొద్ది రోజులుగా వీరి మధ్య మనస్పర్థలు వస్తున్నాయి. గజ్వేల్‌లో అద్దె కు ఉంటున్న ఇంట్లో శుక్రవారం రేణుక ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.